ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5 సిద్దిపేట
గురువారం 29 ఆగస్టు 2024



గణపయ్య.. ముస్తాబయ్యా..





వినాయక చవితికి గణపయ్య విగ్రహాలు ముస్తాబవుతున్నాయి. సిద్దిపేట పట్టణంలోని పలుచోట్ల విగ్రహాల తయారీ జోరుగా సాగుతున్నది. తుదిదశకు చేరుకున్న విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కొన్ని చోట్ల ఇప్పటికే కొనుగోలు చేసి మండపాలకు తరలిస్తు న్నారు. వివిధ ఆకృతుల్లో 5 నుంచి 20 అడుగుల వరకు గణపయ్య విగ్రహాలు దర్శనమిస్తున్నాయి.

-సిద్దిపేట ఫొటోగ్రాఫర్









వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి : ఏసీపీ మధు



సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 28 : వినాయక మండపాలు ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా అను మతి తీసుకోవాలని సిద్దిపేట ఏసీపీ జి.మధు తెలిపారు. అందుకోసం సెప్టెంబర్ 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాల కోసం స్థానిక సంబంధిత పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. కరెంట్ వినియోగానికి విద్యుత్ అధికారుల అనుమతి కూడా ఉండాలని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు మొత్తం బ్లాక్ చేయకుండా టూవీలర్ వెళ్లేలా దారి ఉంచాలన్నారు. డీజేలకు అనుమతి లేదని మైక్ రాత్రి పది తర్వాత ఆపేయాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

3,945

ఏడాదిలో కుక్కకాట్లు

- జిల్లాలో శునకాలతో భయం భయం
- విచ్చలవిడిగా సంచారం
- తీవ్రగాయాలతో ఆస్పత్రులపాలు
- లెక్కింపుతోనే సరిపెట్టిన అధికారులు
- సిద్దిపేట తరహాలో ఏబీసీ సెంటర్లే శరణ్యం

'చేర్యాల పట్టణంలో ఓ బాలుడిపై కుక్కల దాడిని నుంచి తప్పించుకునే క్రమంలో ఆర్టీసీ బస్సు కింద పడి తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. తాజాగా పోచమ్మకాలనీలో ఒకేరోజు 9మందిని కుక్కలు గాయపరిచాయి. ఇక 4వ వార్డులో ఆరుగురి వెంటపడి మరి కరిచాయి. ఇదే మండలంలోని పోతిరెడ్డిపల్లిలో కుక్కకాట్లు నిత్యకృత్యంగా మారాయి.

'అక్బరుపేట-భూంపల్లి మండలం బేగంపేటలో ఇంటి బయట ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. చిన్నారి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.'

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఆగస్టు28: కుక్కకాటు సంఘటన లేకుండా జిల్లాలో తెల్లారడం లేదంటే అతిశయోక్తి కాదు. విశ్వాసానికి మారుపేరుగా చెప్పుకునే శునకాలను చూస్తేనే వెన్నులో వణుకుపుట్టే పరిస్థితులు నెలకొన్నాయి. గుంపులుగుంపులుగా సంచరిస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నాయి. దీంతో రోడ్డుపై నడిచి వెళ్లాలంటేనే జంకాల్సిన పరిస్థితి నెలకొన్నది. కేవలం ఏడాదిలోనే 3,945 మందిని కుక్కలు గాయపరిచినట్లుగా రికార్డులు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కుక్కకాటుకు సంబంధించి రేబిస్ ఇంజక్షన్ తీసుకున్న వారి సంఖ్య ఇది.



సీతారాంపల్లి, మామిడాలలో గాయపడిన మహిళలు

ఒక్క సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలోనే గడిచిన ఏడు నెలల కాలంలో 750 మందికి రేబిస్ ఇంజక్షన్ ఇచ్చారు. ప్రధానంగా చేర్యాల, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక ప్రాంతాల్లో శునకాలు బీభత్సం సృష్టిస్తున్నాయి.

గొర్రెలు, మేకలకూ తప్పని బెడద..

మూగజీవాలకు కుక్కల బెడద తప్పడంలేదు. ఇటీవల చిన్నకోడూరు మండలం గోనెపల్లిలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 14 జీవాలు మృతిచెందాయి. మద్దూరు మండల కేంద్రంలోని ఇద్దరు అన్నదమ్ములకు చెందిన 80 గొర్రెలు కుక్కలు దాడిలో చనిపోయాయి. ప్రధానంగా మాంసం విక్రయ షాపుల వద్ద వ్యర్థాల కోసం కుక్కలు పడిగాపులు పడుతుంటాయి. అక్కడ మాంసం వ్యర్థాలు లేనప్పుడు ఇలా మూగజీవాల మందలపై ఆహారం కోసం దాడి చేస్తున్నాయి. లేదంటే చిన్నారులు, వృద్ధులను టార్గెట్ చేస్తున్నాయి.



గజ్వేల్ పట్టణంలోని వీధుల్లో కుక్కల గుంపు

ఏబీసీ సెంటర్లు ఏర్పాటు చేస్తేనే..

సిద్దిపేటలో తాజాగా ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను తిరిగి ప్రారంభించారు. కానీ కుక్కలను పట్టుకొని తేవడంలో జాప్యం జరుగుతోంది. రోజుకు 20కి మించి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయలేని పరిస్థితి ఉన్నది. ఈ లెక్కన జిల్లాలోని శునకాలకు సర్జరీలు చేయాలంటే 7 సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉంది. అందుకే ప్రతీ మున్సిపాలిటీలో ఈ ఏబీసీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తున్నది. ఇప్పటికే వేలల్లో కుక్కల సంఖ్య ఉంది. భవిష్యత్తులో ఈ సంఖ్య ఇంకా పెరుగుతూ ఉంటుంది. వీటిని నియంత్రించాలంటే ఏబీసీ సెంటర్లతోనే సాధ్యమవుతుందనే అభిప్రాయాలు నెలకొన్నాయి. సిద్దిపేటలో ఉన్నట్లుగానే చేర్యాల, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్‌లోనూ ఈ సెంటర్లను ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

47,568 కుక్కలున్నాయట..

జిల్లావ్యాప్తంగా 47,568 వీధి కుక్కలు ఉన్నట్లుగా జిల్లా పంచాయతీ శాఖ అధికారులు లెక్క తేల్చారు. అందులోని క్రూరమైన కుక్కలను ప్రత్యేకంగా గుర్తించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది ఆయా గ్రామాల్లోని కుక్కలను లెక్కించారు. కుక్కల గణనకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేసింది. ఇందులో ప్రతీగ్రామానికి, ప్రతీ మున్సిపల్ వార్డుకు ఒక కమిటీ చొప్పున ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో శునకాలను లెక్కించి ప్రభుత్వానికి నివేదించాలని పేర్కొన్నారు. కానీ నామమాత్రంగానే శునకాల గణన జరిగినట్లుగా తెలుస్తోంది.



మద్దూరులో కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు

విద్యార్థులను రక్కిన కుక్క..

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 28 : సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులను కుక్క తన గోర్లతో రక్కిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హాస్టల్ విద్యార్థులు శనివారం రాత్రి సమయంలో హాస్టల్ గది నుంచి బయటికి రాగా అక్కడ ఉన్న కుక్క వీరిని చూసి ఒక్కసారిగా బెదరడంతో విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. ఆ గందరగోళంలో ముగ్గురు విద్యార్థులకు కుక్క గోర్ల గాట్లు పడగా సమీప హాస్పిటల్‌లో చికిత్స ఇప్పించినట్లు సిబ్బంది తెలిపారు.

జీపీ భవనాల పనులు త్వరగా పూర్తి చేయాలి

- రైస్ మిల్లులపై తనిఖీలు చేయాలి
- పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలి
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు, పక్కన కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 28: ఈజీఎస్ పథకం ద్వారా చేపడుతున్న గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులను పూర్తిచేసి సెప్టెంబర్ 19 వరకు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధిపై కోఆర్డినేషన్, మానిటరింగ్ సమావేశా(దిశ)నికి ఆయన అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఉపాధిహామీలో కేటాయించిన పనులు పూర్తిగా చేయించడంతోపాటు కూలీలకు రూ.300 పూర్తి కూలీని చెల్లించాలన్నారు. జిల్లాలో 10 సంవత్సరాలుగా నాటిన మొక్కల వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఎటువంటి నిర్మాణాలు జరగకూడదన్నారు. సివిల్ సప్లై అధికారులు రైస్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టి కొనుగోళ్ల ప్రకారం ధాన్యం వివరాలు తెలుసుకోవాలన్నారు. బీడీ పెన్షన్ కొరకు వచ్చిన దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు కేటాయించిన రెండు పడక గదులు అర్హులకు అందాయా , లేదా సమీక్షించి అర్హులకు పట్టాలను అందించాలని కలలెక్టర్‌కు సూచించారు. జిల్లాలో డెంగ్యూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కొత్తగా రెండు బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో పబ్లిక్ టాయిలెట్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా అభివృద్ధి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించకపోవడంతో అధికారుల తీరుపై ఎంపీ రఘునందన్‌రావు అసహన వ్యక్తం చేశారు. మళ్లీ సమావేశానికి పూర్తిస్థాయిలో సమాచారంతో రావాలని సూచించారు. ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి మాట్లాడుతూ.. మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా విద్యుత్ వైర్ల కింద పెద్దగా పెరిగే మొక్కలు కాకుండా తక్కువ ఎత్తులో పెరిగే మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డి, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ భూమి పరిశీలన



సర్వే అధికారులతో పరిశీలిస్తున్న కలెక్టర్

కొండపాక, ఆగస్టు 28 : కలెక్టరేట్ చుట్టుపక్కల కొండపాక మండలంలోని దుద్దెడ, మర్పడగ గ్రామ పరిధిలోని సుమారు 360 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి చుట్టూ ప్రహరీని పూర్తిస్థాయిలో నిర్మించాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి అధికారులును ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయాన్ని ఆనుకోని ఉన్న భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు మ్యాప్‌ను చూపిస్తూ కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. కలెక్టరేట్ కోసం భూమి ఇచ్చిన వారికి ఇందులో లేఅవుట్ చేసి ప్లాట్లను అందించాలన్నారు. ప్రహరీని అక్కడక్కడా సుమారు 500మీటర్ల మేర నిర్మిస్తే పూర్తవుతుందని అధికారులు కలెక్టర్‌కి తెలుపగా.. వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్‌కి కేటాయించిన 10 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. రాజీవ్ రహదారి నుంచి కోర్టు కాంప్లెక్స్‌కి తాత్కాలికంగా దారి, లేఅవుట్ డెవలప్‌మెంట్, ప్రహరీ నిర్మాణానికి సంబంధించిన ప్రపోజల్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ వారితో చర్చించి దానికి ఎస్టిమేట్ తయారు చేసి నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. కలెక్టర్ వెంట ఏడీ సర్వే ల్యాండ్ వినయ్‌కుమార్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రహమాన్ తదితరులు ఉన్నారు.

అన్ని స్కూళ్లల్లో షీ టీమ్ ఫిర్యాధుల బాక్స్

- మహిళ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 28 : సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే జీవితం అంతా బాగుంటుందని సిద్దిపేట మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ అన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, షీ టీమ్ విధులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి షీ టీమ్ బృందం బుధవారం ఇందిరానగర్ హైస్కూల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ దుర్గ మాట్లాడుతూ సోషల్ మీడియా వల్ల ఎంత మంచి ఉందో.. అంతే చెడు కూడా ఉందని గ్రహించాలన్నారు. విద్యార్థి దశలో ఉన్నప్పటినుంచే క్రమశిక్షణ నేర్చుకోవాలని, సమయం వృథా చేయకుండా పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అపరిచిత కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురిచేసినట్లయితే డయల్ 100, కానీ సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీ టీమ్ నెంబర్ 8712667434కు గానీ కాల్ చేసి చెప్పాలన్నారు. అంతేకాకుండా జిల్లాలోని అన్ని స్కూల్స్‌లో షీ టీమ్ ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మాయిలు ఇబ్బందులకు గురైతే ఆ బాక్స్‌లో చీట్టి రాసి వేయాలని సూచించారు. అలా వచ్చిన ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, షీ టీమ్ బృందం తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై దుర్గ

మహిళల ఆర్థికాభివృద్ధికి ఇందిరా మహిళాశక్తి

- హుస్నాబాద్ డివిజన్‌కు 524 డెయిరీ యూనిట్లు మంజూరు
- పూర్తయిన లబ్ధిదారుల ఎంపిక
- పాడి పశువుల కొనుగోలుపై అవగాహన
- ఒక్కో యూనిట్ రూ.93 వేలు

7లో



రైతు రుణమాఫీకి భరోసా

- ఇంటింటికీ వెళ్లి వివరాల నిర్ధారణ
- యాప్‌లో 14,356 రైతుల కుటుంబాలు
- తొలిరోజు 356 కుటుంబాల వివరాల పరిశీలన

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 28: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. రూ.2లక్షల లోపు రుణాలను ఇప్పటికే మాఫీ కాగా, ఆపై రుణం తీసుకున్నవారి విషయంలో త్వరలో ఓ నిర్ణయం తీసుకోనున్నది. ఈ నేపథ్యంలో మూడు విడతల్లో రుణమాఫీ చేసిన కొందరికి మాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయాల్లో అర్జీ ఇవ్వాలని ప్రభుత్వం సూచించడంతో పెద్దఎత్తున రైతులు దరఖాస్తులను అందజేస్తున్నారు. పలు కారణాల వల్ల మాఫీ కాకపోవడంతో ఒక్కో సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. అందులో భాగంగానే రైతు రుణమాఫీ కోసం ప్రభుత్వం 'రైతు భరోసా' పేరిట ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ లో వ్యవసాయ శాఖ అధికారులు రుణమాఫీ కాలేదని అర్జీలు పెట్టుకున్న రైతుల ఇంటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి..

ముందుగా కుటుంబసభ్యులను నిర్ధారణ చేయాల్సి ఉన్న అర్జీలను పరిష్కరించనున్నారు. అధికారులు సదరు రైతుల ఇంటికి వెళ్లి వివరాలను నిర్ధారించనున్నారు. అయితే యాప్‌లో 14,356 రైతుల కుటుంబాల వివరాలను నిర్ధారణ చేయాల్సి ఉండగా.. తొలిరోజు బుధవారం 356 కుటుంబాలను పరిశీలించారు. 'రైతు భరోసా' యాప్‌లో మండల వ్యవసాయ శాఖ అధికారులు(ఏవో)లు మాత్రమే లాగిన్ చేయాల్సి ఉంటుంది. ఏవోలు ఫోన్ నంబర్‌తో లాగిన్ కాగానే క్రాప్‌లోన్ వేయివర్ అని ఆప్షన్ వస్తుంది. అందులోకి వెళ్లి దరఖాస్తుదారుడు తీసుకున్న బ్యాంకు పేరు, బ్రాంచి వివరాలు నమోదు చేయగానే.. రైతుల వివరాలు వస్తాయి. ఆధార్ సంఖ్యను, కుటుంబసభ్యుల పూర్తి వివరాలను నమోదు చేయాలి. చివరకు వ్యవసాయశాఖ మండల అధికారి కుటుంబసభ్యులతో సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అనంతరం దరఖాస్తుదారుడి నుంచి ధ్రువీకరణపత్రం తీసుకోనున్నారు. ఇది ఇష్టపూర్వకంగా సమ్మతిని తెలియజేస్తున్నట్లు రైతు సంతకం చేసి అధికారికి ఇచ్చాక.. ప్రభుత్వం వివరాలను పరిశీలించి రుణమాఫీ చేయనుంది. ఇదే విషయంపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధికను ఆంధ్రజ్యోతి సంప్రదించగా రుణమాఫీ కాలేదని అర్జీలు పెట్టుకున్న రైతుల వివరాలన్నిటిని వ్యవసాయ శాఖ అధికారులు నేరుగా ఇంటికి వచ్చి యాప్‌లో నమోదు చేస్తారని ఆమె పేర్కొన్నారు.



వివరాలను యాప్‌లో నమోదు చేసి కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగుతున్న ఏవో శ్రీనివాస్

రుణమాఫీపై ఆందోళన వద్దు

- గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్

గజ్వేల్, ఆగస్టు 28 : రుణమాఫీకాని రైతులు ఆందోళన చెందవద్దని గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ సూచించారు. గజ్వేల్ మండలం కొడకండ్లలో నిర్వహిస్తున్న కుటుంబ నిర్ధారణ, వివరాల సేకరణను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు స్వయంగా సందర్శించి రైతు కుటుంబాల ఫోటోలు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం దీని ఆధారంగా అర్హులను గుర్తించి రుణమాఫీ వర్తింపజేయనుందన్నారు. గ్రామాల్లో అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చి రైతు కుటుంబాల వివరాలను సేకరిస్తున్నారన్నారు. పూర్తి వివరాలకు గజ్వేల్ మండలంలో ఏవో నాగరాజు(7288894470), కొండపాక- శివరామకృష్ణ (8499912726), కుకునూరుపల్లి- గోవిందరాజులు (9948781551), రాయపోల్- నరేశ్(9573576355)లను సంప్రదించాలన్నారు. వారి వెంట గజ్వేల్ వ్యవసాయ శాఖ ఏఈవో గణేశ్, నర్సింహులు, రైతులు ఉన్నారు.



కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్

మేళ్ల చెరువును కాపాడండి

● బీఎస్పీ నాయకుడు వినయ్‌కుమార్


హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో వినయ్

రామచంద్రాపురం, ఆగస్టు 28 : తెల్లాపూర్‌లోని మేళ్లచెరువు కబ్జాకు గురైందని బీఎస్పీ నాయకుడు వినయ్‌కుమార్ ఆరోపించారు. కొందరు రాజకీయ నాయకులు, బడా బిల్డర్లు చెరువులో మట్టి నింపారని ఆయన తెలిపారు. సర్వే నంబరు 385లో ఎలియన్స్ సంస్థ, సర్వే నంబరు 423, 386లో నెవీ ప్రాపర్టీస్, 422లో సంకల్ప హోమ్స్ సంస్థలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మట్టి వేసి నిర్మాణాలు చేపట్టారని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వివరించారు. వచ్చే వారంలో మేళ్ల చెరువును సందర్శిస్తానని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారని వినయ్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


మనోహర్ (ఫైల్)

వెల్దుర్తి, ఆగస్టు 28: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన వెల్దుర్తి మండల శివారులో బుధవారం చోటుచేసుకున్నది. ఏఎస్‌ఐ సాదత్‌మియా తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన పెద్ది మనోహర్ (23) మండలంలో జరుగుతున్న స్నేహితుడి వివాహానికి యూనికార్న్ వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెల్దుర్తి గ్రామశివారులో పట్టణానికి చెందిన హనుమాద్రి కిష్టాగౌడ్ టీవీఎస్ ఎక్సల్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మనోహర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన కిష్టాగౌడ్‌ను ఆసుపత్రికి తరలించారు. మనోహర్ మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి తల్లి సత్తమ్మ, తండ్రి శ్రీనివాస్, చెల్లెలు దివ్య ఉన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పరిశ్రమపై 'పీసీబీ'కి ఫిర్యాదు


పీసీబీ ఈఈకి ఫిర్యాదు చేస్తున్న గడ్డపోతారం నాయకులు

జిన్నారం, ఆగస్టు 28: గడ్డపోతారంలో వ్యర్థ రసాయనాలు వదిలిన పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని నాయకులు బాలయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, పలువురు పీసీబీ మెంబర్ సెక్రటరీ, ఈఈలకు బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్సీపూర్‌లోని కార్యాలయంలో ఈఈ కుమార్‌పాటక్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. రెండురోజులుగా ఓ పరిశ్రమ ఔట్‌లెట్ నుంచి భారీ ఎత్తున వ్యర్థాలను బయటకు వదిలారని, అధికారులు శాంపిల్స్ కూడా సేకరించారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

పటాన్‌చెరు, ఆగస్టు 28: పటాన్‌చెరు మండలం ఇంద్రేశం పంచాయతీ పరిధిలో అనుమతులకు మించి నిర్మించిన కట్టడాలను పంచాయతీ సిబ్బంది బుధవారం కూల్చేశారు. పంచాయతీ పరిధిలోని పీఎన్‌ఆర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లు జీ +2 అనుమతులు తీసుకుని అక్రమంగా అంతస్తులు నిర్మించడంతో పంచాయతీ చర్యలకు ఉపక్రమించింది. పోలీసుల రక్షణలో పంచాయతీ సిబ్బంది శ్లాబులను కూల్చేశారు. నిర్మాణదారులకు గతంలోనే నోటీసులు జారీ చేసి నేడు కూల్చివేశామని ఈవో సుభాష్ తెలిపారు.

సిర్గాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న సంగ్రామ్ మహరాజ్

కల్హేర్, ఆగస్టు 28: సిర్గాపూర్‌లోని సేవా భారతి గణేష్ మండపంలో శ్రీ వరసిద్ధి వినాయకసహిత వీర హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సేవాభారతి గణేష్ మండపంలో నిర్మించిన ఆలయంలో విగ్రహాలకు జలాధివాసం, ధాన్యాధివాసం, ఫల, పుష్పాధివాసాలు నిర్వహించిన అనంతరం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్, ప్రముఖ వాస్తు శాస్త్ర పండితుడు గురునాథ్ మహరాజ్‌లు పాల్గొని ప్రవచనాలు చెప్పారు. కార్యక్రమంలో సేవాభారతి యువజన సంఘం బాధ్యులు, సిర్గాపూర్ మాజీ ఎంపీటీసీ పీరప్ప, మాజీ సర్పంచులు స్వప్న శంకరయ్య స్వామి, శ్రీనివాస్‌రావ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావ్, సీఆర్పీ శివకుమార్, నాయకులు మహేశ్వర్‌గుప్త పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం


మహంకాళీ అమ్మవారు

చేగుంట, ఆగస్టు 28 : చేగుంటలోని మహంకాళీ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఈనెల 29న 6 గంటలకు సుప్రభాతము నిత్యపూజా హారతి, గణపతిపూజ, 30న అమ్మవారికి పంచామృత అభిషేకం, చండీహోమం 108 కలశాల ఊరేగింపు, 31న రుద్ర మండప హోమాలు, మహా పూర్ణహుతి, అమ్మవారికి ఒడి బియ్యం, 1న బోనాలు తొట్టెల ఊరేగింపు, 2న అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ఇందిరా మహిళాశక్తి

హుస్నాబాద్ డివిజన్‌కు 524 డెయిరీ యూనిట్లు మంజూరు

- పూర్తయిన లబ్ధిదారుల ఎంపిక
- పాడి పశువుల కొనుగోలుపై అవగాహన
- ఒక్కో యూనిట్ రూ.93 వేలు



పాడి గేదె నుంచి పాలు సేకరిస్తున్న మహిళ

కోహెడ, ఆగస్టు 28: స్వశక్తి మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిరా మహిళాశక్తిని ప్రభుత్వం అమలుచేస్తోంది. ఇందులో భాగంగా మహిళలతో డెయిరీ యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు చర్యలు చేపట్టారు. డెయిరీ యూనిట్‌లో భాగంగా పాడిగేదె కొనుగోలు రూ.75 వేలు, పశు దాణ రూ.7,200, గేదె రవాణా రూ.3 వేలు, పశు బీమా రూ.5,088, రవాణా బీమా రూ.443, షేర్ క్యాపిటల్ రూ.1,704, సురక్ష చార్జీలు రూ.835, మొత్తం యూనిట్ విలువ రూ.93,270 ఉంటుంది.

524 యూనిట్లు మంజూరు

ఇందిరా మహిళాశక్తి పథకం కింద మొదటివిడతలో హుస్నాబాద్ డివిజన్‌కు 524 యూనిట్లు కేటాయించారు. కోహెడ మండలానికి 156 యూనిట్లు, హుస్నాబాద్‌కు 84 యూనిట్లు, అక్కన్నపేటకు 144 యూనిట్లు, మద్దూరు మండలానికి 140 యూనిట్లు మంజూరయ్యాయి. స్వశక్తి సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళా సభ్యుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కోహెడలో 156 యూనిట్లకు 173 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. తెలంగాణ మినహా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచి పాడి గేదెలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్క పాడి గేదె యూనిట్‌కు మొదటగా రూ.93,270 రుణం మంజూరు చేశారు. ఈ రుణంతో ఆవు లేదా గేదెను కొనుక్కోవాలి. ఈ రుణాన్ని లబ్ధిదారు నెలకు రూ.2,500 చొప్పున 48 వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఆరునెలలు అనంతరం మరొక పాడి గేదె కొనుగోలుకు రుణం మంజూరు చేస్తారు.

పశు వైద్యులతో అవగాహన

మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో పశువైద్యాధికారులతో మహిళా సంఘాల సభ్యులకు పాడి పశువుల కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. పశువుల బ్రీడ్ ఎంపిక, అధిక పాల దిగుబడిని ఇచ్చే పశువుల లక్షణాలు, అందించాల్సిన దాణ, వాటికి వచ్చే వ్యాధులు, దూడల పెంపకం, మొదలగు అంశాలపైన అవగాహన కల్పించారు.

బల్క్‌మిల్క్ సెంటర్‌కు ప్రతిపాదనలు

మహిళల నుంచి సేకరించిన మొదటి సంవత్సరం 3 వేల లీటర్ల పాలు ప్రభుత్వ డెయిరీ సిద్దిపేట విజయ కేంద్రానికి పంపించనున్నారు. ఇందుకుగాను కోహెడ మండలం బస్వాపూర్‌లో 7,500 లీటర్ల కెపాసిటీ గల బల్క్‌మిల్క్ సెంటర్ ఏర్పాటు చేయాలని గుర్తించారు. తహసీల్దార్‌కు స్థలం గుర్తించి ఎంపిక చేసి ప్రతిపాదించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. సుమారు రూ.80 లక్షల ఖర్చవుతుందని ప్రతిపాదించారు.



కోహెడలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి శ్రావణ్‌కుమార్

15 రోజుల్లో గ్రౌండింగ్



పక్క రాష్ట్రాల నుంచి పాడి గేదెలను కొనుక్కోవాల్సి ఉంటుంది. 15 రోజుల్లో డెయిరీ యూనిట్ల గ్రౌండింగ్ పూర్తి చేస్తాం. లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు పాడి గేదెల ఎంపికపై అవగాహనా సదస్సులు నిర్వహించడం జరిగింది.

\- తిరుపతి, ఏపీఎం, కోహెడ

పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పులిమామిడి రాజు



పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిమామిడిరాజు

సదాశివపేట, ఆగస్టు 28: సదాశివపేట పట్టణ సమీపంలోని వెంకటాపూర్ గ్రామంలో శ్రీమార్కండేయ కాలనీలో నిర్మించిన ఆలయంలో బుధవారం శ్రీబోరంచ పోచమ్మతల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అందులో భాగంగా ఆలయంలో అగ్నిప్రతిష్ఠ, యజ్ఞం, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు గంగారాం, సిద్ధిరాములు, శ్యాంరావు, మల్లప్ప, చంద్రమౌళి, రాంచందర్, మనోహర్, సురేష్, హరిక్రిష్ణ, రాము, నర్సింహా, వీరేశం, అరుణ్‌కుమార్, సాయన్న, రాజు, ఈశ్వరయ్య, సదానందం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



యాకుబ్ మృతదేహం

మిరుదొడ్డి, ఆగస్టు 28: విద్యుదాఘాతంతో వ్యక్తి బుధవారం మృతిచెందాడు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి మధిర గ్రామమైన మాదన్నపేట గ్రామానికి చెందిన యాకుబ్(35) గ్రామ శివారులోని యాదగిరి అనే రైతు స్టార్టర్ డబ్బాను రిపేర్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అప్పులబాధతో ఆత్మహత్య

గజ్వేల్, ఆగస్టు 28: అప్పులబాధతో వ్యక్తి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గజ్వేల్ మండల పరిధి బూర్గుపల్లి గ్రామానికి చెందిన చెలిమేటి చంద్రం(30) గుత్తేదారుగా ఇళ్లను నిర్మిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అప్పులు పెరిగిపోవడంతో తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపం చెందాడు. రెండురోజుల క్రితం భార్య, పిల్లలను గజ్వేల్ మండల పరిధి ర్యాగట్లపల్లిలోని వారి తల్లి ఇంటి వద్ద వదిలేసి వచ్చాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి చంద్రం విగతజీవిగా కనిపించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దుబ్బాక, ఆగస్టు 28: ప్రమాదవశాత్తు నీటిలో పడిన వ్యక్తి- చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. దుబ్బాకలోని డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన రియాజ్(17) ఈనెల 24న దుబ్బాకలోని బొడనికుంటలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడ్డాడు. అక్కడే ఉన్న శివ అనే వ్యక్తి రియాజ్‌ను బయటకు తీశాడు. 108 అంబులెన్స్ సహాయంతో దుబ్బాక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటకు, అనంతరం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అత్యాచారయత్నానికి పాల్పడ్డ యువకుడి అరెస్ట్

నారాయణఖేడ్, ఆగస్టు 28: మతిస్థిమితం సక్రమంగా లేని వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో మతిస్థిమితం లేని 64 ఏళ్ల వృద్ధురాలు సోమవారం రాత్రి పట్టణంలోని రాయిపల్లి మార్గంలో ఉన్న రోడ్డు మీద నిద్రించింది. రాత్రి 11.40 గంటల సమయంలో ఖేడ్ పట్టణానికి చెందిన మహబూబ్(27) మద్యం సేవించి.. అటుగా నడుచుకుంటూ వచ్చాడు. వృద్ధురాలిని గమనించి అత్యాచారయత్నం చేయగా.. అటువైపు నుంచి బైక్‌లపై వస్తున్న వారు గమనించి అరవడంతో పారిపోయాడన్నారు. వారు మంగళవారం షోరూం ముందు ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా.. ఈ విషయం బయటకు వచ్చిందన్నారు. బాధితురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.

సరిపడా బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు



సరిపడా బస్సులు లేక వచ్చిన బస్సులోనే ఎగబడి ఎక్కుతున్న ప్రయాణికులు

నర్సాపూర్, ఆగస్టు 28: నర్సాపూర్ నుంచి సంగారెడ్డికి వెళ్లే మార్గంలో రద్దీకి తగ్గ బస్సులు లేక వచ్చిన బస్సుల్లో సామర్థ్యానికి మించి వెళ్తూ.. ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. నర్సాపూర్ నుంచి సంగారెడ్డికి విద్యనభ్యసించేందుకు విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులతో పాటు ఇతర పనుల కోసం వెళ్లేవారు వందలాది మంది ఉంటారు. ముఖ్యంగా విద్యార్థులకు, ఉద్యోగులకు ఉదయం, సాయంత్రం పూట సరిపడా బస్సులు లేవు. దీంతో వచ్చిన బస్సులో ఎగబడి ఎక్కాల్సిన పరిస్థితి వస్తుందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఎగబడి ఎక్కే క్రమంలో ఇదే అదునుగా భావించిన కొందరు చేతివాటం చూపుతుండడంతో ఫోన్లు, పర్సులు, నగలు కూడా పోతున్నాయని పేర్కొంటున్నారు. నర్సాపూర్‌లో డిపో ఉన్నా ఇక్కడి నుంచి సంగారెడ్డికి ఈ డిపో బస్సులు నడపకపోవడంతో గజ్వేల్, సంగారెడ్డి డిపో బస్సులపై ఆధారపడాల్సి వస్తుందని, అవి ఎప్పుడు వస్తాయో.. కూడా తెలియని పరిస్థితి ఉన్నదన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా నర్సాపూర్ నుంచి ఉదయం సాయంత్రం పూట సరిపడా బస్సులు నడపాలని కోరుతున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేలు అమలు చేయాలి

● సంగారెడ్డిలో మహార్యాలీ, నిరసన దీక్ష



సంగారెడ్డిలో మహార్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 28: విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేలు అమలు చేయాలని సమగ్ర శిక్ష జేఏసీ అధ్యక్షుడు శేషాద్రి డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగులు సంగారెడ్డిలో మహార్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నేరవేర్చాలని కోరారు. గతేడాది హన్మకొండలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెలరోజుల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. ఆరోగ్యబీమా రూ.10 లక్షలు, జీవితబీమా రూ.10 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపక్షంలో దశలవారీగా పోరాటాలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్తూరు ప్రభుత్వ భూమిని కాపాడండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొత్తూరు గ్రామస్థులు

ములుగు, ఆగస్టు 28: కొత్తూరు గ్రామంలో ధరణిలో పేర్లు తప్పుపడడంతో ప్రైవేటు కంపెనీ పేరుమీద వస్తుందని, దాన్ని సరిచేయాలని బుధవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆధ్వర్యంలో కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ కొత్తూరు గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. గ్రామ పరిధిలోని గూనెవారి కుంట సర్వే నంబరు 290లో 9-22 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, గత ప్రభుత్వంలోని ధరణి తప్పిదాల ఫలితంగా ఒక ప్రైవేట్ కంపెనీ పేరు నమోదైనట్లు పేర్కొన్నారు. దాన్ని వెంటనే తొలగించి జరిగిన తప్పిదాన్ని సరిచేయాలని కోరారు. అదేవిధంగా ఈ కంపెనీ నుంచి వచ్చే కలుషిత నీటిని కుంటలోకి వదలడంతో ఆ నీటిని తాగిన పశువులు, నీటిలోని చేపలు మృత్యువాత పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో కొత్తూరు గ్రామ నాయకులు రజనీకాంత్, సతీష్, అరుణ్, ప్రసాద్, శివకుమార్ నరేష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 28: రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొక్కొండ గ్రామానికి చెందిన రవీందర్ తన కొడుకు సాత్విక్(14)తో బైక్‌పై మేడ్చల్ పట్టణం జాతీయ రహదారి పైనుంచి చెక్‌పోస్టు వైపు మంగళవారం రాత్రి వెళ్తుండగా.. వెనకనుంచి వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రవీందర్, సాత్విక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా.. ఇందులో సాత్విక్ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

సకాలంలో కుటుంబ నిర్ధారణ సర్వేను పూర్తి చేయాలి

- సంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్
- కవేలిలో కుటుంబ నిర్ధారణ ఇంటింటి సర్వే పరిశీలన



కవేలిలో రైతులతో మాట్లాడుతున్న డీఏవో శివప్రసాద్

కోహీర్, ఆగస్టు 28: రెండు లక్షల రుణమాఫీ కానీ రైతుల కుటుంబ నిర్ధారణ ఇంటింటి సర్వేను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం కోహీర్ మండలంలోని కవేలి గ్రామంలో మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్ నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను డీఏవో పరిశీలించి మాట్లాడారు. రూ.2 లక్షలలోపు రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వం రూపొందించిన రైతుభరోసా, పంట రుణమాఫీ యాప్‌లో పొందుపర్చాలన్నారు. రుణమాఫీ కాని రైతుల కుటుంబ నిర్ధారణ సర్వేలో భాగంగా కుటుంబసభ్యుల ఆధార్‌తో పాటు భూమి సర్వే నంబరు లోన్ ఖాతా వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అంతేకాకుండా ఈ సర్వేను డివిజన్ వ్యవసాయ అధికారి ఎప్పటికప్పుడు పరిశీలించాలని డీఏవోను ఆదేశించారు. రుణమాఫీ కాలేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్నారు. అనంతరం పలువురు రైతులతో డీఏవో మాట్లాడారు. ఆయన వెంట ఏడీఏ బిక్షపతి, మండల ఏవో నవీన్‌కుమార్, ఏఈవో శ్రీనివాస్, రైతులు తదితరులు ఉన్నారు.

ఏవోకు మాత్రమే లాగిన్‌తో సర్వేకు ఆలస్యం

కోహీర్ మండలంలో చాలామంది రైతులకు రెండు లక్షల రూపు రుణమాఫీ కాలేదు. ఇందుకు సంబంధించి రైతులు ఆయా రైతువేదికల వద్ద వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారుల వద్దకు దరఖాస్తులు పట్టుకుని నిత్యం తిరుగుతున్నారు. అయితే ప్రభుత్వం అర్హులైన రైతులకు రుణమాఫీ రాలేనందున ఆ రైతులకు తిరిగి రుణమాఫీ అందించేందుకు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. రైతుల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పొందుపరిచేందుకు మండల వ్యవసాయ అధికారికి మాత్రమే అనుమతి ఇచ్చింది. ఏవోలకు మాత్రమే లాగిన్ ఉండడం వల్ల అందరి వివరాలు ఒకరే చేయాలంటే ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉన్నది. అంతేకాకుండా సకాలంలో సర్వే పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. క్లస్టర్ వారీగా క్లస్టర్ ఏవోలకు లాగిన్ ఐడీలు ఇస్తే సర్వే తొందరగా పూర్తవుతుందని పలువు రైతులు పేర్కొన్నారు.

విద్యుత్ అమరుల స్ఫూర్తితో పోరాటాలు

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య



సంగారెడ్డిలోని కేకే భవన్‌లో విద్యుత్ అమరువీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28: బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన విద్యుత్ అమరుల స్ఫూర్తితో పోరాటాలు సాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో బుధవారం విద్యుత్ అమరువీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్‌చార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా బషీర్‌బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాలుపుల్లో రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్దన్‌రెడ్డిలు అమరులయ్యారని అన్నారు. చంద్రబాబునాయుడు విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకురావడానికి ప్రయత్నిస్తే విద్యుత్ రంగం ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, ప్రైవేటుపరం చేయవద్దని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ పోరాటం చేశామని గుర్తుచేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధి బృందం ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో పర్యటన చేసిందని, ఈ పర్యటనలో ప్రపంచ బ్యాంకుతో ఏం చర్చలు జరిపారు. ప్రపంచ బ్యాంకు ఎలాంటి సలహాలు ఇచ్చిందో తెలంగాణ ప్రజలకు బహిర్గతం చేయాలని చుక్క రాములు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సర్వే



శివాజినగర్‌లో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28: సీజనల్ వ్యాధులపై సంగారెడ్డి పట్టణంలోని శివాజినగర్‌లో బుధవారం వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికున్‌గున్యా కేసులు ఎన్ని ఉన్నాయనే వివరాలు సేకరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని వేయకూడదని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎం.కీర్తి, ల్యాబ్ టెక్నీషియన్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సంగమేశ్వర సమాఖ్య సభ్యురాలు మాధవి పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయ పాలకవర్గం ఏర్పాటెప్పుడో?

● ఎటూ తేల్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం ● కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశావహులు ఎదురుచూపులు



వీరభద్రస్వామి ఆలయం

గుమ్మడిదల, ఆగస్టు 28: భక్తులకు కొంగు బంగారమైన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయ నిర్వహణకు పాలకవర్గం ఏర్పాటులో తీవ్ర జాప్యం నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఆరునెలలు దాటినా పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైందని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల ముందు ఆలయశాఖ నోటిఫికేషన్ ఇచ్చినా.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆ నోటిఫికేషన్ రద్దయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాలకవర్గం ఏర్పాటు ప్రక్రియ మొదటికొచ్చింది. దీంతో ఆశావహులు నిరాశకు గురవుతున్నారు. కాగా ఆలయ చైర్మన్ పదవి కోసం ఆశవహులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. కొంతకాలం క్రితం ఈ ఆలయ కమిటీ ఏర్పాటుపై మండల నాయకులతో అధిష్ఠానం చర్చించినట్లు సమాచారం. జిల్లాలోని శైవక్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన బొంతపల్లి వీరన్న వీరభద్రస్వామి ఆలయం అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలంటే చైర్మన్ పదవికి ఎవరు సమర్థుడు అనే కోణంలో చర్చించి.. వారి పేరు ఇవ్వాలని మండల నాయకులతో చెప్పినట్లు సమాచారం. మండల నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఏకతాటిపై ఓ మండల యువ నాయకుడి పేరు ప్రతిపాదించి అధిష్ఠానానికి పంపినట్లు తెలిసింది. కాగా చైర్మన్ పదవి స్థానిక బొంతపల్లి గ్రామానికి చెందినవారికే ఇవ్వాలని కొందరు సీనియర్ నాయకులు వాదిస్తున్నారు. మెజార్టీ నాయకులంతా పక్క గ్రామానికి చెందిన ఆ యువకుడి పేరే ప్రతిపాదన చేయడంతో పాలకవర్గానికి పోటీలేదు. అధిష్ఠానం పాలకవర్గాన్ని ప్రకటించడమే ఆలస్యమని భావించారు. పాలకవర్గ ప్రక్రియ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది. దీంతో ఆశవహులు నిరాశ, నిస్పృహలకు గురయ్యారు. పార్లమెంట్ ఎన్నికల ముగిసి రెండునెలలు గడిచినా.. ఇప్పటికీ ఆలయ పాలకవర్గం ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టిసారించలేదు. కాగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరిపోవడంతో పాలకవర్గం ఏర్పాటు తొందర్లో జరుగుతుందని పలువురు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్‌లో కష్టపడిన కార్యకర్తలకే పదవులు వస్తాయని ఎమ్మెల్యే సైతం చెప్పడం మండల సీనియర్ నాయకుల్లో సంతృప్తినిచ్చింది. దీంతో గతంలో ప్రతిపాదించిన ఆ యువ నాయకుడికే ఆలయ కమిటీ చైర్మన్ పదవి దక్కే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మిగతా డైరెక్టర్ పదవులు కూడా పార్టీ కోసం పదేళ్లు కష్టపడిన వారికే దక్కనున్నాయి.




బీదర్ రోడ్డుపై చెట్లతో ప్రకృతి పరిచిన పందిరి



మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్‌లో జలపాతం

కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగం

- బీదర్, కోహీర్, మొగుడంపల్లి రోడ్లపై పందిరి వేసిన చెట్లు
- జాడిమల్కాపూర్‌లో జాలువారే జలపాతం
- నేలపై పచ్చని తివాచీ పరిచిన పొలాలు, గుట్టలు



విట్టునాయక్‌తండా చుట్టూ పచ్చందనం



ఆనెగుంట-లచ్చునాయక్‌తండాల సమీపంలో నేలపై ప్రకృతి పరిచిన గ్రీనరీ

జహీరాబాద్, ఆగస్టు 28: ప్రకృతి రమణీయతను పంచుతూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, కర్ణాటకలోని గొట్టంకోట అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ అందాలను తిలకించేందుకు నిత్యం వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు. విట్టునాయక్‌తండా గుట్టపై ఉండడంతో ప్రకృతి పరిచిన గ్రీనరీ ఎంతగానో ఆకట్టుకుంటున్నది. ఆనెగుంట-లచ్చునాయక్‌తండాల సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఎక్కడచూసినా కొండలు, గుట్టలు, పంట పొలాలు పచ్చని తివాచీ పరిచినట్లు కనిపిస్తాయి. మండలంలోని గోవిందాపూర్ మీదుగా మొగుడంపల్లి, ఇప్పెపల్లి, జహీరాబాద్ మీదుగా బీదర్ వెళ్లే రోడ్డుపై రైల్వే గేటు మొదలుకుని అల్లానా చౌరస్తా వరకు, కోహీర్ మండలంలోని కోహీర్ చౌరస్తా-కవేలి గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు పచ్చని పందిరి వేసేలా కనిపిస్తున్నాయి. మొగుడంపల్లి సమీపం కర్ణాటకలోని గొట్టంకోట అందాలు కూడా చూపరులను కనువిందు చేస్తున్నాయి. మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్‌లో జలపాతాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

'జ్వర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట జిల్లా వైద్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 28: జ్వర సర్వేను అధికారులు, సిబ్బంది సమన్వయంలో పకడ్బందీగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా వైద్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్ సూచించారు. సిద్దిపేటలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశాల మేరకు బుధవారం ప్రోగ్రాం అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, మెడికల్ అధికారులు, సిబ్బందితో కలిసి ప్రోగాం అధికారి డాక్టర్ కె. ఆనంద్ జ్వర సర్వే, సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న జ్వరం కేసులను అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రహదారి మరమ్మతులకు నోచుకునేనా?

- గోవర్ధనగిరి, తిమ్మాపూర్ రోడ్డు అధ్వానం
- తరచూ ప్రమాదాలు
- బాగు చేయించాలని ప్రజల వేడుకోలు

తొగుట, ఆగస్టు 28: మండలంలోని గుడికందుల మీదుగా గోవర్ధనగిరి నుంచి తిమ్మాపూర్‌కు వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. దీంతో వర్షం పడినప్పుడు గుంతల్లో నీరు చేరి వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికే చాలాసార్లు వాహనదారులు గుంతల్లో పడి తీవ్రగాయాల పాలయ్యారు. తిమ్మాపూర్ నుంచి పద్మనాభునిపల్లి మీదుగా కొండాపూర్ నుంచి గోవర్ధనగిరి, గుడికందుల వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు విస్తరించి ఉన్నది. ఈ రోడ్డును 22 ఏళ్ల క్రితం అప్పటి దొమ్మాట ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి నిధులు మంజూరు చేయించి తారు రోడ్డుగా మార్పించారు. రోడ్డుకు మరమ్మతులు చేపడితే మెదక్ రహదారి నుంచి తొగుట మీదుగా రాజీవ్ రహదారికి వెళ్లేందుకు ఈ లింక్ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గోవర్ధనగిరి శివారులో గుంతలమయంగా రోడ్డు

మరమ్మతులు చేయించాలి



గుంతల రోడ్డు కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. తరచూ ప్రమాదాలు జరిగి అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేయించాలి

- నంట స్వామిరెడ్డి, గోవర్ధనగిరి

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా



రోడ్డు అధ్వానంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చాలా మంది వాహనదారులు గాయాలపాలయ్యారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్డుకు మరమ్మతులు చేయాలి

- మల్లుగారి శ్రీకాంత్‌రెడ్డి, గుడికందుల

హెచ్‌ఐవీకి మందు లేదు.. నివారణే మార్గం

- గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిక్కత్ అంజూమ్

గజ్వేల్, ఆగస్టు 28: హెచ్‌ఐవీకి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిక్కత్ అంజూమ్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కో-ఎడ్యుకేషన్)లో భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్, స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలోని ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, డిగ్రీ కళాశాలల్లోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, ప్రోగ్రాం ఆఫీసర్స్ పాల్గొనగా, గజ్వేల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిక్కత్ అంజుమ్, ఓయూ ప్రొఫెసర్ భవాని, గజ్వేల్ ఐసీడీసీ అధికారి మల్లారెడ్డిలు హాజరై ప్రసంగించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, ఎయిడ్స్‌కి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. ఎయిడ్స్ బారిన పడిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు, పింఛన్, లోన్లు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ బి. కస్తూరి, జయరాజు, ఎస్.మహేందర్, వై రామచంద్రం, పెద్దిరాజు, శ్రద్ధానందం, పుణ్యమ్మ, వెంకటేశ్వర్లు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ప్రోగ్రాం ఆఫీసర్లు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అంజూమ్

కుటుంబ నిర్ధారణకు ఇంటింటి సర్వే

- వివరాలు సేకరించి వ్యవసాయాధికారులు

మద్దూరు/రాయపోల్/మర్కుక్/కోహెడ/చిన్నకోడూరు, ఆగస్టు 28: మూడు విడుతల్లోనూ రుణమాఫీలో చోటుదక్కని రైతు కుటుంబాల నిర్ధారణ కోసం ఇంటింటి సర్వే చేసి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నట్లు మద్దూరు ఏవో రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రాకేష్‌తో పాటు రైతులు ఉన్నారు. రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్, ఏఈవో ప్రవీణ్ రామారంలో రేషన్‌కార్డు లేకపోవడంతో పంట రుణమాఫీ కాని రైతుల కుటుంబసభ్యుల వివరాలు, బ్యాంకు రుణాల వివరాలను సేకరించారు. మర్కుక్ మండలంలోని గంగాపూర్, ఎర్రవల్లి, నరసన్నపేట గ్రామాల్లో రుణమాఫీ 2024 అర్హులై ఉండి రేషన్‌కార్డులేని రైతుల నిర్ధారణ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్, భానుశ్రీ, రైతులు పాల్గొన్నారు. కోహెడ మండలంలో మూడు విడతల రుణమాఫీలో 650 మంది రైతు కుటుంబాలకు రుణమాఫీ కాలేదని అధికార యంత్రాంగం గుర్తించింది. ఈ మేరకు మండలంలోని బస్వాపూర్, సముద్రాల గ్రామాల్లో రుణమాఫీలో భాగంగా కుటుంబ సభ్యుల నిర్ధారణకు ఏవో సతీష్ విచారణ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మహిపాల్, రాకేష్ పాల్గొన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చిన్నకోడూరు మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్‌కుమార్ అన్నారు. చిన్నకోడూరు, మాచాపూర్‌లో ఏఈవోలతో కలిసి ఆయన రుణమాఫీ కానీ రైతుల కుటుంబసభ్యుల నిర్ధారణ సర్వే చేశారు.



కోహెడ: బస్వాపూర్‌లో వివరాలు సేకరిస్తున్న ఏవో

మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అఫ్రోజ్

దూళిమిట్ట,ఆగస్టు 28: దూళిమిట్ట మండల నూతన వ్యవసాయ అధికారిగా బుధవారం అఫ్రోజ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేర్యాల మండలం నుంచి దూళిమిట్ట మండలానికి వ్యవసాయ అధికారిగా బదిలీపై వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఏఈవోలతో కలిసి వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలను ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఏఈవో రాధిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి'

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 28: గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు బుధవారం సిద్దిపేటలో ఎన్సాన్‌పల్లి రోడ్డులో ఉన్న ఓ కార్పొరేట్ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. మూడు రోజులుగా ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నిర్మాణ దశలో ఉన్న పాఠశాలలో తరగతులను నిర్వహించకూడదని, వెంటనే నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక ప్రిన్సిపాల్ పనులు నిలిపివేయడంతో శాంతియుతంగా ధర్నా నిర్వహించి విద్యార్థి సంఘాల నాయకులు వెళ్లిపోయారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

మంత్రి దామోదరను కలిసిన కాంగ్రెస్ గజ్వేల్ మండలాధ్యక్షుడు

గజ్వేల్, ఆగస్టు 28: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను గజ్వేల్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తన పేరును పరిశీలించాలని కోరినట్లు తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, ఆగస్టు 28: చేర్యాల పట్టణంలోని సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ సీఈసీ విభాగంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తికలిగిన విద్యార్థులు తమ టీసీ, బోనఫైడ్, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణపత్రాలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సెప్టెంబరు 1న సబ్ జూనియర్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

మిరుదొడ్డి, ఆగస్టు28: వచ్చేనెల 1న బీహెచ్‌ఈఎల్‌లో ఓల్డ్ ఎంఐజీలో నిర్వహించే బాల్‌బ్యాడ్మింటన్‌సబ్ జూనియర్ బాలబాలికల జట్లను ఎంపిక చేస్తామని ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరయ్య తెలిపారు. మిరుదొడ్డిలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ ఎంపికలకు హాజరైయ్యే క్రీడాకారులు 2-1-2010 లోపు జన్మించి ఉండాలని, ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు మాత్రమే అర్హులన్నారు. వివరాల కోసం 9440703038, 9704746511 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

'సీజనల్ వ్యాధుల దృష్ట్యా జాగ్రత్తలు తీసుకుంటున్నాం'



జీరో వేస్ట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నర్సయ్య

గజ్వేల్, ఆగస్టు 28: సీజనల్ వ్యాధుల దృష్ట్యా జాగ్రత్తలు తీసుకుంటున్నామని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఆయా వార్డుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం మురుగుకాలువలను శుభ్రం చేయించి, దోమల నివారణ మందును పిచికారి చేయించారు. గజ్వేల్ పట్టణంలోని డంపింగ్ యార్డులో బయోమైనింగ్ ద్వారా నిర్వహిస్తున్న జీరో వేస్ట్‌ను పరిశీలించారు. వారితో మున్సిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్

మర్కుక్, ఆగస్టు 28: మండలంలోని శివారు వెంకటాపూర్ గ్రామంలో దుర్గమ్మ పండగ సందర్భంగా దళితులను బోనాలు తీయకుండా అడ్డుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్ డిమాండ్ చేశారు. గ్రామాన్ని బుధవారం సందర్శించి ఆయన మాట్లాడుతూ.. సంఘటన జరిగి నాలుగైదు రోజులు గడుస్తున్నా ఉన్నతాధికారులు ఎవరూ గ్రామాన్ని సందర్శించలేదని, వెంటనే సందర్శించి గ్రామంలో కుల వివక్షతను రూపుమాపే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మరాటి కృష్ణమూర్తి, డివిజన్ నాయకులు వెంకటేష్, మర్కుక్ మండల అధ్యక్షుడు పొట్టొల్ల దాసు, గ్రామస్థులు ఎల్లమ్మ, మల్లమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌కు నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

మర్కుక్, ఆగస్టు 28: వెంకటాపూర్‌లో నేడు నిర్వహించబోయే పౌరహక్కుల దినోత్సవానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరవుతారని మర్కుక్ మండల తహసీల్దార్ అరీఫా తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు కూడా హాజరవుతారని అన్నారు.

ఆహ్లాదకరంగా జేపీ తండా రోడ్డు



పచ్చని చెట్లతో జేపీ తండా రోడ్డు

నంగునూరు, ఆగస్టు 28: హరితహారంలో భాగంగా నంగునూరు మండలం జేపీ తండా రోడ్డు వెంట నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనం పంచుతున్నాయి. రోడ్డు వెంట వెళ్లే ప్రజలు, వాహనదారులకు నీడనిస్తూ ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. రాంపూర్ చౌరస్తా నుంచి జేపీ తండా వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ వరకు మొక్కలు నాటి సంరక్షించారు.

కోటి పార్థివలింగ ప్రతిష్ఠాపన మహాయజ్ఞం



చేర్యాల: ఆకునూరులో ఊరేగింపుగా బోనాలను తీసుకువెళ్తున్న మహిళలు

దౌల్తాబాద్, అగస్టు 28: మండలంలోని దొమ్మాట, గాజులపల్లిలో నిర్మితమవుతున్న దక్షిణ కాశీ కైలాసేశ్వర శివుని ఆలయ ప్రాంగణంలో ఈ నెల 29, 30, 31, సెప్టెంబర్ 1, 2న కోటి పార్థివలింగ ప్రతిష్ఠాపన మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు బ్రహ్మ శ్రీకొడకండ్ల శ్రీరామ్ చరణ్ శర్మగురూజీ తెలిపారు. బుధవారం ఆయన ఆలయ ప్రాంగణంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలను తిలకించడానికి భక్తులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో దొమ్మాట మాజీ సర్పంచ్ కొమ్మెర పూజీత వెంకటరెడ్డి, గాజులపల్లి సర్పంచ్ అప్పావారు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

- **చేర్యాల:** చేర్యాల మండలం ఆకునూరులో కురుమ కుల సంఘం ఆధ్వర్యంలో తమ కులదైవమైన బీరప్పకు ఘనంగా బోనాలు సమర్పించారు.
- **కుకునూరుపల్లి:** చిన్నకిష్టాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైల్వే ఎల్‌సీ గేటును ఏర్పాటు చేయాలి

- ఎంపీకి రైతుల వినతి



ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కుకునూరుపల్లి, ఆగస్టు 28: రైల్వే ఎల్. సీ గేటును ఏర్పాటు చేయాలని ఎంపీ రఘునందన్‌రావుకు రైతులు వినతిపత్రం అందజేశారు. కుకునూరుపల్లి శివారులో ఉన్న లక్ష్మి చెరువు రైల్వేట్రాక్ మీదుగా దాదాపు 100 మంది రైతులు వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. కానీ ట్రాక్ మీదుగా రాకపోకలను రైల్వే అధికారులు నిషేధించారు. దీంతో రైతులకు, అధికారులకు మధ్య వారం క్రితం ఘర్షణ కూడా జరిగింది. దీంతో బుధవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావుని కలెక్టరేట్‌లో కలిసి రైల్వే ఎల్. సీ గేటు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని రైతులు తెలిపారు.

ఉమ్మడి సర్వీస్‌రూల్స్ అమలు చేయాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కె.రాంరెడ్డి

చేర్యాల, ఆగస్టు 28: ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌ను ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కె. రాంరెడ్డి కోరారు. చేర్యాల పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా పాలకులు ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయకపోవడంతో విద్యారంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఎంఈవో, డైట్ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పోస్టులను ప్రయోషన్ల ద్వారా భర్తీ చేసిన తర్వాతే ఎస్టీటీలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. సమావేశంలో యూనియన్ మండలాధ్యక్షుడు కె.రాంరెడ్డి, నాయకులు నరేశ్, వెంకటరమణ, సుధాకర్, గోవిందరాజు, గదరాజు నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్, బాబు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తాం

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

హుస్నాబాద్, ఆగస్టు 28: గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు కేడం లింగమూర్తి, అక్కు శ్రీనివాస్, కోమటి సత్యనారయణ, వడ్డేపల్లి వెంకటరమణ, మడప యాదవరెడ్డి, గ్రంథాలయ సిబ్బంది దాసరి రాజు తదితరులు ఉన్నారు.

పెయ్య దూడల ఉత్పత్తి పథకంపై నేడు అవగాహన సదస్సు

గజ్వేల్, ఆగస్టు 28: పెయ్య దూడల ఉత్పత్తి పథకంపై గోపాల మిత్రలు, పశువైద్య సిబ్బందికి నేడు అవగాహన కల్పించనున్నట్లు పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ రమేశ్‌బాబు పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు పశుగణాభివృద్ధి సంస్థ, జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ రాంజీ హాజరవుతారని తెలిపారు.

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు నవతకు డాక్టరేట్



సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 28: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగంలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న జేజే నవతకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ దక్కింది. 'ఏ స్టడీఆన్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ సెలక్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఇన్ ఇండియా' అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా నవతను కళాశాల అధ్యాపక బృందం, ప్రిన్సిపాల్ అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- తొగుట సీఐ లతీఫ్

తొగుట, ఆగస్టు 28: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని తొగుట సిఐ లతీఫ్ సూచించారు. రాంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా గంజాయి అమ్మినట్లు గాని సేవిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఇతర వివరాలు గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పొద్దన్నారు.కార్యక్రమంలో తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు, కళాశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కోహెడ: మాట్లాడుతున్న హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్

- **గజ్వేల్:** గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలోని జీఎంఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆయా చట్టాలపై, షీటీమ్స్‌పై షీటీమ్ బృందంతో కలసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా కీలకమని, సమాయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థి దశలో మత్తు, గంజాయి వంటి పదార్థాలకు అలవాటు పడవద్దని, బానిసలుగా మారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ కిట్స్ ద్వారా నిర్ధారణ పరీక్షలు జరుపుతున్నామని, ఏడు రోజుల పాటు దాని ప్రభావం ఉటుందని, కేసులు నమోదు అయితే జీవితాలు నాశనమవుతాయన్నారు. ఆయనవెంట జీఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి, షీటీమ్స్ బృందం సభ్యులు శ్రీరాములు, శ్యామల, రాంచంద్రారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



తొగుట : సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తొగుట సీఐ లతీఫ్

సముద్రాలలో కనువిప్పు కార్యక్రమం

కోహెడ, ఆగస్టు 28: మండలంలోని సముద్రాలలో పోలీస్ కళా బృందంతో బుధవారం రాత్రి కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అభిలాష్ హాజరైయ్యారు. మూఢనమ్మకాల నిర్మూలన, సైబర్ నేరాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు, తదితర అంశాలపై కళాజాత సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఒకరికి తీవ్ర గాయాలు

సిద్దిపేట క్రైం ఆగస్టు 28: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరుకు చెందిన ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగి గుట్టపర్తి విశ్వనాథం ద్విచక్రవాహనంపై సిద్దిపేటకు వచ్చి రంగీలా దాబా చౌరస్తా నుంచి హైదరాబాద్ వైపు మలుపు తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టి డివైడర్ పైకి ఎక్కింది. ఈ ప్రమాదంలో విశ్వనాథానికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటన స్థలికి చేరుకుని అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదాలు జీవితాలను తలకిందులు చేస్తాయి

- సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 28: రోడ్డు ప్రమాదాలు జీవితాల్ని తలకిందులు చేస్తాయని, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేయడం వల్ల మీతో పాటు మీ ఎదుటి వారి ప్రాణాలకు ప్రమాదమని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేసే వాహనదారులకు సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపే వారిపై ఎంవీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐలు ఉమేష్, సదాశివరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రింగ్ బాక్సుల దొంగ అరెస్ట్

హుస్నాబాద్, ఆగస్టు 28: హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్) గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటి ముందు ఉన్న సెంట్రింగ్ బాక్సులను ఎత్తుకెళ్లిన దొంగను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్ కు పంపించినట్లు ఎస్ఐ తోట మహేష్ తెలిపారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన ఉప్పరాజు అనే నిందితుడిని అరెస్టు చేసి అతడి నుంచి సెంట్రింగ్ బాక్సులను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన మైనర్లను డీ అడిక్షన్ సెంటర్‌లో చేర్పించిన పోలీసులు

చేర్యాల, ఆగస్టు 28: గంజాయికి బానిసలుగా మారి జల్సాల కోసం ఇతరులకు విక్రయిస్తూ కొమురవెల్లి మండలకేంద్రంలో ఇటీవల పట్టుబడిన ఇరువురు మైనర్లను బుధవారం సిద్దిపేట జిల్లాకేంద్రంలోని డీ-అడిక్షన్ సెంటర్‌లో చేర్పించి కౌన్సిలింగ్ ఇచ్చామని ఎస్ఐ రాజుగౌడ్ తెలిపారు. గంజాయి, మత్తు, మాదక ద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.

మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలి

- ఏసీపీ వాసాల సతీష్



ఏసీపీ సతీష్

హుస్నాబాద్/కుకునూరుపల్లి, ఆగస్టు 28: వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఏసీపీ వాసాల సతీష్ సూచించారు. హుస్నాబాద్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మండపానికి ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే ఏ రోజుకు సంబంధించిన దరఖాస్తులను ఆదేరోజు పరిశీలించి వెంటనే అనుమతులను మంజూరు చేస్తామన్నారు.

వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, నియమనిబంధనలు పాటించాలని కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ, విద్యుత్ అధికారుల అనుమతి తప్పనిసరని, మండపాల్లో డీజేకి అనుమతి లేదని, వీలైతే సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోవాలని, ఏర్పాటు సమయంలో రోడ్డు మొత్తం ఆక్రమించవద్దని సూచించారు.

బఫర్‌జోన్లలోని అక్రమ నిర్మాణాలను కూల్చాలి

- మున్సిపల్ అధికారులకు బీజేపీ నాయకుల వినతి

చేర్యాల, ఆగస్టు 28: చేర్యాల పట్టణంలోని సాగు, తాగునీటి అవసరాలు తీర్చుతున్న కుడిచెరువు, పెద్దచెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని కోరుతూ బీజేపీ నాయకులు మున్సిపల్ అధికారులకు బుధవారం వినతిపత్రం అందించారు. పలువురు తప్పుడు పత్రాలతో ఎలాంటి అనుమతులు పొందకుండా భవనాలు, ఫంక్షన్‌హాళ్లు నిర్మించారని, రెండు చెరువుల పరిరక్షణ దృష్ట్యా తొలగింపుచర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంకుగారి శశిధర్‌రెడ్డి, పోతుగంటి రాందాస్, పుర్మ సంజీవరెడ్డి, కాశెట్టి పాండు, కొట్టె చంద్రమౌళి, వడ్లకొండ సంజీవులు, తౌట సురేశ్, షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి'

చేర్యాల, ఆగస్టు 28: ప్రజాహితం సీఎం రేవంత్‌రెడ్డి కార్యదక్షతతో అమలుచేస్తున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ సంస్థాగత బలోపేతం కోసం పాటుపడాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కోరారు. చేర్యాల మండలం కాంగ్రెస్ వీరన్నపేట గ్రామశాఖ అధ్యక్షుడిగా సూర్న శ్రీకాంత్‌ను నియమించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయనను అభినందించిన అనంతరం కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలుతో అన్నివర్గాల ప్రజలు సంతోషంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కొండపాక భిక్షపతి, సాగర్, నాయకులు పాల లక్ష్మీనారాయణ, పుర్మ ఆగంరెడ్డి, రంగు శంకర్, దాసరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- బీజేపీ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు దేవరాజు

మిరుదొడ్డి, ఆగస్టు 28: పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని బీజేపీ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు దేవరాజు కోరారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మిరుదొడ్డి మండలంలో 6వేల పైగా సభ్యత్వనమోదు కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కానుగంటి శ్రీనివాస్, సురేష్, సదానందారెడ్డి, బాను, స్వామి, రవి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, రాజు, నారాయణరెడ్డి, అశోక్, సంతోష్ తదితరులున్నారు.

'మన బడిని మనమే రక్షించుకుందాం'

చేర్యాల, ఆగస్టు 28: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మనబడిని మనమే రక్షించుకుందామని నాగపురి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి అన్నారు. చేర్యాల మండలం నాగపురి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు జక్కుల తిరుపతి, ఆవుల సందీప్, ఆవుల నాగరాజు, బాకర్, అబ్బాస్, సంతోష్‌రెడ్డితో పాటు స్కూల్ జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ సౌండ్ సిస్టమ్‌ను బుధవారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీపీసీ చైర్మన్ గుర్రాల శోభ, ఉపాధ్యాయులు భవాని, రత్నాకర్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో పండిన కూరగాయలే తినాలి

- లోడి సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి



ఉచితంగా పంపిణీ చేసిన విత్తనాలను చూపుతున్న రైతులు

అక్కన్నపేట, ఆగస్టు 28: సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలనే తినాలని లోడి సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి అన్నారు. మండలంలో పలు గిరిజన తండాలలో మానోస్ యూనిదాస్ సహకారంతో రైతులకు బుధవారం కూరగాయల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువులతో సాగు చేసిన కూరగాయలనే తినాలని సూచించారు. ఆయనవెంట లోడి సంస్థ ఫీల్డ్ కో ఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, ప్రతినిధులు కనకం రవీందర్, భూక్య బిచ్చ తదితరులున్నారు.